క్లుప్తంగా

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరగనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబర్ 060810011006681 టౌన్ కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ చేస్తారు. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లలో సంప్రదించవచ్చు.

గోరింటాకుతో వారాహి మాతకు అలంకరణ



గోరింటాకు అలంకరణలో అనఘాలక్ష్మీదేవి, వారాహి అమ్మవారు

అల్లిపురం: అల్లిపురం షిర్డీసాయి దర్బార్‌లో కొలువైన శ్రీ వారాహి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మూడో రోజు సోమవారం స్వప్న వారాహి పూజ ఆలయ అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని గోరింటాకు పాదులతో విశేషంగా అలంకరించారు. మహిళలు అమ్మవారికి కుంకుమ పూజలు చేసి, వారాహి స్తోత్రంతో కీర్తించారు. ఒకరికొకరు తాంబూలాలు ఇచ్చి పుచ్చుకున్నారు. అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పిల్లలు బడిలోనే ఉండాలి



అల్లిపురంలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులతో ఎంఈవో-1 పైడపునాయుడు తదితరులు

అల్లిపురం: బడి ఈడు పిల్లలు ఉండాల్సింది పనిలో కాదని.. బడిలోనే ఉండాలని మండల విద్యా శాఖాధికారి-1 బి.పైడపునాయుడు అన్నారు. అల్లిపురం మోడల్ స్కూల్ విద్యార్థులు సోమవారం నిర్వహించిన 'నేను బడికి పోతా' కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బడి మానేసిన పిల్లలను గుర్తించి వారిని తిరిగి పాఠశాలలో చేర్పించడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు తెలిపారు. అల్లిపురం మెయిన్ రోడ్డు, చలువతోట, అల్లిపురం మార్కెట్ రోడ్డు తదితర ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీఆర్‌పీ కె.వెంకటలక్ష్మి, ప్రధానోపాధ్యాయిని కె.కనకమహాలక్ష్మీ, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వంశీకృష్ణకు సత్కారం



వంశీకృష్ణను సత్కరిస్తున్న మన్యాల శ్రీనివాస్

డాబాగార్డెన్స్: ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌ను కూటమి నాయకులు సోమవారం గజమాలతో సత్కరించారు. జనసేన పార్టీ 29వ వార్డు నాయకుడు మన్యాల శ్రీనివాస్ నేతృత్వంలో జిల్లా పరిషత్ శ్రీకృష్ణ చైతన్య మఠం వద్ద విజయోత్సవ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వంశీని ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తనను అత్యధిక మెజారిటీతో గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటానని, దక్షిణ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు.

సంక్షేమ ప్రదాత వైఎస్సార్

- మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్
- వాడవాడలా రాజన్న జయంతి వేడుకలు
- సేవా కార్యక్రమాలతో మహానేతకు మనసారా నివాళి



మహానేత వైఎస్సార్ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

డాబాగార్డెన్స్: దివంగత ముఖ్యమంత్రి, మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 75వ జయంతి సందర్భంగా సోమవారం నియోజకవర్గంలో మహానేత విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పేదలకు పండ్లు, రొట్టెలు, స్వీట్లు పంచిపెట్టారు. వృద్ధాశ్రమాల్లో ఉదయం టిఫెన్, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. పేద వృద్ధ మహిళలకు చీరలు అందజేశారు. వైఎస్సార్ జయంతి వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, పార్టీ నాయకులు ద్రోణంరాజు శ్రీవత్సవ్, మూగి శ్రీనివాస్, సీనియర్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ప్రజల పక్షాన పోరాడుతాం

జీవీఎంసీ 29వ వార్డు జగదాంబ జంక్షన్ వద్ద పార్టీ నాయకులు పీతల వాసు, దొడ్డి బాపూ ఆనంద్ నేతృత్వంలో మహానేత వైఎస్సార్ విగ్రహానికి వాసుపల్లి గణేష్‌కుమార్, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్‌గాంధీ, డాక్టర్ మూగి శ్రీనివాసరావు తదితర నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముందుగా కేక్ కట్‌చేశారు. అనంతరం పేదలకు చీరలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించిన మహనీయుడు వైఎస్సార్ అని కొనియాడారు. గత ఐదేళ్ల పాలనలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాజన్న ఆశయాలను మరింత ముందుకు తీసుకెళ్లారన్నారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమైనప్పటికీ ప్రజలకే తెలియని ఓటమి ఎదురు చూశామన్నారు. వైఎస్సార్ జయంతితో మళ్లీ ప్రజల ముందుకు వచ్చామని, వైఎస్సార్‌సీపీ ప్రజల పక్షాన ఇక నుంచి పోరాడుతుందని వెల్లడించారు. కార్యక్రమంలో ముజీబ్‌ఖాన్, మాదాబత్తుల రమేష్, దశమంతుల మాణిక్యాలరావు, రాము మాష్టారు, పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సేవలు మరువలేనివి

జగదాంబ: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి రాష్ట్రానికి చేసిన సేవలు మరువలేనివని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ దక్షిణ సమన్వయకర్త ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. 35వ వార్డు గాజుల వీధిలో పార్టీ వార్డు అధ్యక్షుడు అలపన కనకరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం నాడు రాజన్న ప్రవేశపెట్టిన పథకాలు ఇప్పటికీ ప్రజల గుండెల్లో నిలిచిపోయాయన్నారు. అనంతరం రామకృష్ణ జంక్షన్ ఆవరణలో భారీ కేక్ కట్‌చేసి పేదలకు పండ్లు, చీరలు పంపిణీ చేశారు. పార్టీ అధికార ప్రతినిధి కొండా రాజీవ్‌గాంధీ, దుర్గాలమ్మ ఆయల కమిటీ చైర్మన్ నాయిని మల్లిబాబు, పార్టీ సిటీ సెక్రటరీ ఆదివిష్ణురెడ్డి, వార్డు నాయకులు కర్రి రాము, నాయిన తమ్మన్నరెడ్డి, మహిళా ప్రెసిడెంట్ బత్తుల రాము, రాంగాల రవికుమార్, పుష్ప, శ్రీనివాసరెడ్డి, రమణమ్మ, సంతోషరెడ్డి, నగేష్, దుర్గాప్రసాద్, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

పేదలకు పండ్ల పంపిణీ

జీవీఎంసీ 39వ వార్డులో వైఎస్సార్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షురాలు, ఎస్‌కేఎంఎల్ ఆలయ మాజీ చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం ఆధ్వర్యంలో పేదలకు పండ్లు పంపిణీ చేశారు. పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్‌గాంధీ, సనపల రవీంద్రభరత్, బాబ్జీ, ముజీబ్‌ఖాన్, అప్పారావు, సలీం, సతీష్, పోలరాజు, పైడిరత్నం, నాగమణి, కనకదుర్గ, బంగారి, అనిల్, బుజ్జి, మసేన్, రవి తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ వైఎస్సార్‌కు ఘన నివాళి

అల్లిపురం: జీవీఎంసీ 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి ఆధ్వర్యంలో అచ్చియ్యమ్మపేటలోని డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. కేక్ కట్‌చేసి, పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఎరుకుమాంబ అమ్మవారి దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ లండా రమణ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి లింగం శ్రీనివాస్, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అచ్చియ్యమ్మపేటలో తోట పద్మావతి ఆధ్వర్యంలో కేక్ కట్‌చేస్తున్న వాసుపల్లి

- వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పచ్చిరిపల్లి రాము ఆధ్వర్యంలో 33వ వార్డు కుమ్మరవీధిలో వైఎస్సార్ చిత్రపటానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు కేపీ రెడ్డి, పీవీఎస్ రెడ్డి, వేగి రాము, పిల్లి శ్రీనివాసరెడ్డి తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వృద్ధులకు పండ్లు అందజేశారు.
- పార్టీ 33వ వార్డు సీనియర్ నాయకుడు బొడ్డేటి ప్రసాద్ ఆధ్వర్యంలో అల్లిపురం పాల సంఘం వద్ద వైఎస్సార్ చిత్రపటానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు నివాళులర్పించారు. బొడ్డేటి కిషోర్, కొడమంచిలి శ్రీను, సూరిశెట్టి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు వైఎస్సార్

కంచరపాలెం: మహానేత వైఎస్సార్ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు అన్నారు. 41వ వార్డు జ్ఞానాపురంలోని పార్టీ కార్యాలయంలో కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ, క్లస్టర్ ఇన్‌చార్జి కోడిగుడ్ల శ్రీధర్ నేతృత్వంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం 300 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు ద్రోణంరాజు శ్రీవత్సవ్, వేశంగిణిరావు, పాత్రపిల్లి సునీల్‌కుమార్, చిన్నిరెడ్డి, విక్రాంత్, మధు, ఆనంద్, మురళీ, పెంటారావు, అన్నపూర్ణ, దేవి తదితరులు పాల్గొన్నారు.

మహానాయకుడు రాజన్న

సీతమ్మధార: జీవీఎంసీ 27వ వార్డు దొండపర్తిలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు నీలాపు సర్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ చిత్రపటానికి మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ముందుగా కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ మహానాయకుడని, ఆయన ఆశయాలను మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొనసాగించారన్నారు. జాన్‌వెస్లీ, కొండ రాజీవ్‌గాంధీ, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వేమన సంఘం నివాళి

ఆశీలమెట్టలోని వేమన మందిరం వద్ద ఉన్న దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి శ్రీవేమన సంక్షేమ సంఘం అధ్యక్షుడు నీలాపు వివేకనందరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు సత్తి నాగేశ్వరరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ బోర కుమార్‌రెడ్డి, కొయ్య రమణారెడ్డి, కర్రి రామారెడ్డి, దల్లి రామకృష్ణారెడ్డి, నీలాపు రమణారెడ్డి, డి.వి.ఎస్.ప్రసాద్‌రెడ్డి, బాకి శ్యామకుమార్‌రెడ్డి, వై.ఈశ్వరరెడ్డి, మరడ శ్రీనివాసరెడ్డి, మద్ది ఈశ్వరరెడ్డి, హరిహరరెడ్డి, శీరపు దివాకర్‌రెడ్డి, యడ్ల శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



39వ వార్డులో వైఎస్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్, పార్టీ నాయకులు



రామకృష్ణ జంక్షన్‌లో వృద్ధులకు పండ్లు, చీరలు అందిస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్ తదితరులు



పాల సంఘం వద్ద వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బొడ్డేటి ప్రసాద్ తదితరులు



27వ వార్డులో వాసుపల్లి గణేష్‌కుమార్‌కు కేక్ తినిపిస్తున్న నాయకులు



కుమ్మర వీధిలో వృద్ధులకు పండ్లు అందిస్తున్న పచ్చిరిపల్లి రాము




వేమన మందిరంలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వేమన సంక్షేమ సంఘం సభ్యులు



41వ వార్డులో మహిళలకు చీరలు అందిస్తున్న కోలా గురువులు, కోడిగుడ్ల శ్రీధర్, శ్రీవత్సవ్

ట్రాఫిక్ నిబంధనలతో ప్రమాదాల నియంత్రణ

ఏయూ క్యాంపస్: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే చాలా వరకు రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చునని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వెంకట శేషమ్మ అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ న్యాయ కళాశాలలో సోమవారం మోటారు వాహన చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మోటారు వాహన చట్టాలపై అవగాహన అవసరమన్నారు. ద్విచక్ర వాహనచోదకులు హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించిన వారు సీటు బెల్టు పెట్టుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.సీతామాణిక్యం, న్యాయ సేవా విభాగం సమన్వయకర్త డాక్టర్ ఎల్.వి ప్రసాద్, ఆచార్యులు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న వెంకట శేషమ్మ

'విజయ నిఘంటు చంద్రిక' ఆవిష్కరణ రేపు

సీతంపేట: శ్రీగోకుల్‌చంద్ర, రాహుల్ చంద్ర మెమోరియల్ ట్రస్టు, సహృదయ సాహితి సంస్థల ఆధ్వర్యంలో ఈనెల 10వ తేదీ సాయంత్రం 6 గంటలకు మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో 'విజయ నిఘంటు చంద్రిక' ఆవిష్కరణ జరుగుతుందని విజయ్ నిర్మాణ్ కంపెనీ అధినేత ఎస్.విజయకుమార్ తెలిపారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తిరుపతిలోని వేదిక్ విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు డాక్టర్ రాణి సదాశివమూర్తి పర్యవేక్షణలో విజయ తెలుగు వైద్యుతి మహానిఘంటువు రూపొందిందని, ఇది ఇ డిక్షనరీ అని పలువురు నిపుణుల సహకారంతో సదాశివమూర్తి ఈ మహా నిఘంటువును పూర్తిచేశారని తెలిపారు. పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు నిఘంటువును ఆవిష్కరించి సందేశం ఇస్తారని తెలిపారు. సాహితీవేత్త డీవీ సూర్యారావు నిఘంటు స్వరూపాన్ని పరిచయం చేస్తూ ఇప్పటికే ఉన్న ప్రసిద్ధ నిఘంటువులలోని పదాలతో పాటు విజ్ఞాన శాస్త్రాలలోని పరిభాషిక పదాలు ఇందులో చేర్చారని, 50వేలకు పైగా పదాలు ఇందులో ఉంటాయని తెలిపారు. ఆరోజు జరగనున్న సభలో ఆచార్య వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రి, బేతవోలు రామబ్రహ్మం, కోలవెన్ను మలయవాసిని, డీవీ సూర్యారావు ప్రసంగిస్తారని తెలిపారు. సహృదయ సాహితి అధ్యక్షులు శేఖరమంత్రి ప్రభాకర్, కేజీ వేణు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విజయకుమార్

లయన్స్ క్లబ్ సేవలు విస్తృతం చేయాలి

ఎంవీపీ కాలనీ: లయన్స్ క్లబ్ సేవలను మరింత విస్తృతం చేయాలని క్లబ్ పూర్వ గవర్నర్ ఆచార్య వి.ఉమామహేశ్వరరావు సూచించారు. నగరంలోని ఓ హోటల్లో లయన్స్ క్లబ్ వాల్తేర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. క్లబ్ సేవలు అన్ని వర్గాల వారికి చేరువ చేయాలన్నారు. రక్తదాన శిబిరాలు, మెడికల్ క్యాంపులు పెద్ద ఎత్తున నిర్వహించాలన్నారు. ఈ ఏడాది లక్ష మొక్కలు నాటేందుకు ప్రణాళికలు అమలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం 2024–25 ఏడాదికి లయన్స్ క్లబ్ వాల్తేర్‌కు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. క్లబ్ నూతన అధ్యక్షుడిగా డాక్టర్ బి.దేముడు, కార్యదర్శిగా ఆచార్య ఎంవీ జగన్నాథరాజు, ఉపాధ్యక్షులుగా ఆచార్య పి.కింగ్, ఆచార్య ఎస్.రామకృష్ణ తదితరులు నియమితులయ్యారు. ఈ కార్యక్రమంలో క్లబ్ జిల్లా గవర్నర్ ఆచార్య ఎన్‌వీవీఎస్ ప్రసాద్, జిల్లా కోశాధికారి ఆచార్య రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీలో పడిపోయిన ఆవు

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు ఉక్కు జనరల్ ఆస్పత్రి ప్రధాన రహదారిలోని డ్రైనేజీలో ఆవు కాలు జారి పడిపోయింది. డ్రైనేజీ ఇరుగ్గా ఉండడంతో కనీసం కదలడానికి వీలులేక ఆవు డ్రైనేజీ నుంచి బయటికి రావడానికి ఇబ్బంది పడింది. ఆవును గమనించిన స్థానికులు జీవీఎంసీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు, వార్డు కార్యదర్శి కనకేశ్వరరావుల సహకారంతో బయటికి తీశారు. ప్రజారోగ్యశాఖ సిబ్బంది ఎం.రమేష్, ఎం.గాంధీ, జి.ఈశ్వరరావు, చిరంజీవి, రమణ పాల్గొన్నారు.



ఆవును బయటికి తీస్తున్న జీవీఎంసీ సిబ్బంది, స్థానికులు

జోన్-5లో వినతుల స్వీకరణ



అర్జీదారుల సమస్యలు వింటున్న జెడ్సీ ఆర్‌జీవీ కృష్ణ

కంచరపాలెం: జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్-5 కార్యాలయంలో 'ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ' కార్యక్రమం సోమవారం జరిగింది. అర్జీదారుల నుంచి జోనల్ కమిషనర్ ఆర్.జీ.వి.కృష్ణ నేరుగా వినతులు స్వీకరించారు. వాటిని ఆయా విభాగాల అధికారులకు అందజేసి, సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని జెడ్సీ ఆదేశించారు. టౌన్ ప్లానింగ్ విభాగానికి 2, పబ్లిక్ హెల్త్ విభాగానికి 1, ఇంజినీరింగ్ విభాగానికి 1 చొప్పున వినతులు అందినట్లు జెడ్సీ తెలిపారు. కార్యక్రమంలో ఈఈలు తారా ప్రసన్నరెడ్డి, మత్స్యరాజు, ఏసీపీ వెంకటరావు, ఆర్‌వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.సునీల్‌కుమార్, ఏపీడీలు పద్మావతి, చిరంజీవి పాల్గొన్నారు.

ఉక్కు ఉద్యోగుల పీఎఫ్ సమస్యలపై వినతి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల హయ్యర్ పెన్షన్‌పై నగదు బదిలీ అయినప్పటికీ దానికి సంబంధించిన పెన్షన్ రాకపోవడంతో ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారని స్టీల్‌ప్లాంట్ పీఎఫ్ ట్రస్ట్ సభ్యులు రీజనల్ పీఎఫ్ కమిషనర్ విజయకుమార్ దృష్టికి తీసుకువెళ్లారు. నగరంలోని పీఎఫ్ కార్యాలయంలో సోమవారం ఆయన్ను కలిసిన సభ్యులు, అర్హత వచ్చిన తర్వాత పెన్షన్ దరఖాస్తు అమలు సమయంలో ఎదుర్కొంటున్న సమస్యలను అధిగమించడానికి స్టీల్‌ప్లాంట్‌లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని కోరారు. దీనిపై పీఎఫ్ కమిషనర్ మాట్లాడుతూ హయ్యర్ పెన్షన్ అంశంపై పీఎఫ్ హెడ్ ఆఫీసు నుంచి తుది నిర్ణయం రావాల్సి ఉందన్నారు. పీఎఫ్ జమ అంశంపై ఉక్కు యాజమాన్యంతో మాట్లాడతానని తెలిపారు. త్వరలోనే స్టీల్‌ప్లాంట్‌లో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామన్నారు. ఆయన్ను కలిసిన వారిలో నరేష్‌కుమార్, చీకటి శ్రీనివాస్, రామచంద్రరావు, తదితరులు ఉన్నారు.

వ్యాస రచన పోటీలకు విశేష స్పందన

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం జనాభా అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులకు సోమవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ నెల 11న ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని «జనాభా పోకడలు–సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు దిశగా పురోగతి» అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీలకు విశేష స్పందన లభించింది. నగరంలోని వివిధ కళాశాలలకు చెందిన సుమారు 100 మంది విద్యార్థులు ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. తెలుగు, ఆంగ్ల మాధ్యమాలలో ఈ పోటీలు జరిగాయి. విజేతలకు ఈ నెల 11న జరిగే ప్రపంచ జనాభా దినోత్సవంలో భాగంగా బహుమతులు ప్రదానం చేయనున్నారు. ఈ కార్యక్రమంలో జనాభా అధ్యయన కేంద్రం సంచాలకుడు, ఏయూ స్టాటిస్టిక్స్ విభాగాధిపతి ఆచార్య బి.మునిస్వామి, తదితరులు పాల్గొన్నారు.



వ్యాస రచన పోటీలో పాల్గొన్న విద్యార్థులు

వినికిడి సమస్యలపై విద్యార్థులకు అవగాహన

డాబాగార్డెన్స్: రోటరీ క్లబ్ వైజాగ్ కపుల్స్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక సంస్థ కార్యాలయంలో వినికిడి సమస్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు శివకుమార్ మాట్లాడుతూ చెవి సంబంధిత విషయంలో ఎట్టి పరిస్థితిలోనూ నిర్లక్ష్యం చెయొద్దని సూచించారు. విద్యార్థి స్థాయి నుంచి వినికిడి సమస్యలపై అవగాహన ఏర్పరచుకోవడం ద్వారా వాటి నుంచి ఉపశమనం పొందే అవకాశం ఉంటుందన్నారు. ఆర్‌సీవీసీ యూత్ సర్వీసెస్ డైరెక్టర్ డీఎన్ ఆశాజాస్తి, కరుణ మాట్లాడుతూ ఇప్పటికే సమాజాభివృద్ధిలో భాగంగా ప్రజలను చైతన్యపరిచే కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. రోటరీ క్లబ్ వైజాగ్ కపుల్స్, ఆర్‌సీవీసీ యూత్ సర్వీసెస్, సన్ ఇంటర్నేషనల్ రోటరాక్ట్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రోటరీ క్లబ్ వైజాగ్ కపుల్స్ ప్రతినిధి

ప్రతి రోజూ కాలువల శుభ్రత

జగదాంబ: కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని జీవీఎంసీ జోన్-4 ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.రాజేష్ ఆదేశించారు. 35వ వార్డులో సోమవారం ఆయన పర్యటించి.. పందుపుల్లల సందు, వన్ టౌన్ ప్రధాన రహదారి, పూర్ణా మార్కెట్ ప్రాంతాలను పరిశీలించారు. క్రమంగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో కాలువల్లో ఎక్కడా మురుగు నీటి ప్రవాహం ఆగకుండా ప్లాస్టిక్ కవర్లు, బాటిళ్లు వంటివి లేకుండా రోజూ పరిశుభ్రం చేయాలన్నారు. లేనిపక్షంలో నీటిలో దోమల లార్వాలు ఉత్పత్తి జరిగి వ్యాధులకు కారణమవుతాయన్నారు. వార్డు ఇన్‌స్పెక్టర్లు, పారిశుధ్య సెక్రటరీలు విధిగా కార్మికులతో పనులు చేయించాలని సూచించారు. నివాసులు, దుకాణ యజమానులు చెత్తను కాలువల్లో వేయకుండా, ప్రతి ఇంటిలో, దుకాణం వద్ద చెత్త వేసుకునే మూడు రకాల డబ్బాలు పెట్టుకోవాలన్నారు. లేనిపక్షంలో ఆయా దుకాణదారుడికి అపరాధ రుసుం విధించాలని ఏఎంహెచ్‌వో ఆదేశించారు. రహదారులపై ఎక్కడా మురుగునీరు ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వార్డు ఇన్‌స్పెక్టర్లు, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.



పాతనగరంలో కాలువను శుభ్రం చేయిస్తున్న ఏఎంహెచ్‌వో రాజేష్

డీఎస్సీ అభ్యర్థుల వయో పరిమితి పెంచాలని వినతి

ఎంవీపీ కాలనీ: డీఎస్సీ అభ్యర్థుల వయో పరిమితి అర్హతను 46 ఏళ్లకు పెంచాలని ఏయూ విద్యార్థి సంఘ నాయకులు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్సీ చిరంజీవిని సోమవారం ఎంవీపీ కాలనీలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు సిర్లా శ్యామ్, దంతేశ్వర్ పట్నాయక్ మాట్లాడుతూ కొన్నేళ్లుగా నోటిఫికేషన్స్ లేకపోవడంతో నిరుద్యోగ అభ్యర్థులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఈ నేపథ్యంలో నిరుద్యోగులకు మేలు చేసే విధంగా ప్రభుత్వం జనరల్ కేటగిరీ అభ్యర్థుల ఉద్యోగ వయోపరిమితిని పెంచాలని కోరారు.



ఎమ్మెల్సీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు